తండ్రికి తలకొరివి పెట్టడానికి కొడుకు ఆస్తి కోరితే ప్రేమను ఆశించే ఆ కూతురు ఏంచేసింది?

# సంస్కారం

గొల్లపూడి దుర్గావతి

కథ

"చూడుబాబూ సుదర్శనం! ఈ సమయంలో నువ్విలా మొండిపట్టు పట్టడం ఏం బావుండలేదు. ఏమన్నా వ్యవహారాలు వుంటే తర్వాత తీరికగా తేల్చుకోవచ్చు. ముందు జరగవలసిన సంగతి చూడు. అవతల సూర్యాస్తమయం కావస్తోందికూడాను" అన్నారు మాష్టారు.

"నాది మొండిపట్టు అంటారేమిటండీ. అయినా నేను అడిగినదాంట్లో తప్పేమన్నా వుందా? ఆ ఎకరం పొలం నా పేర రాయమనండి. అప్పుడే చేస్తాను" అన్నాడు పట్టుదలగా సుదర్శనం.

"అవతల మీ నాన్నగారి శవాన్ని పెట్టుకుని నువ్విలా అనడం భావ్యంకాదు. పెద్ద కొడుకుగా నీ విధి నిర్వర్తించు. నలుగురూ ఏమైనా అనుకోగలరు" అన్నారాయన.

"ఎవరేం అనుకుంటే నాకేమండీ. ముందు విషయం తేల్చమనండి. అప్పుడు నేను చేసేది చేస్తాను. నాకు చెప్పేముందు ఆ మాటలు ఏవో ఆవిడగార్కి చెప్పమనండి" అన్నాడు ముఖం గంటుపెట్టుకుని.


"అసలే భర్తపోయిన బాధతో ఆ ఇల్లాలు కుమిలిపోతోంది. ఇలాంటి సమయంలో ఈ మాట చెప్పడం..."

తనవల్ల కాదు అన్నట్లు చూశారాయన.

ఆ తెల్లవారుజామున కన్నుమూశాడు నారాయణ.

టెలిగ్రాం అందుకున్న ఒక్కగానొక్క కొడుకు సుదర్శనం, పెళ్లయి కాపురాలు చేసుకుంటున్న కూతుళ్లు ఇద్దరూ వచ్చారు.

తండ్రిశవాన్ని చూసి బావురుమన్నారు.



చూడవచ్చిన వాళ్లంతా తలోరకంగా సాను భూతి మాటలు చెప్పారు.

వాళ్ల మాటల మధ్య అసలు విషయం అప్పుడు తెలిసింది అతనికి.

తండ్రి చనిపోయేముందు ఉన్న ఎకరం పొలాన్ని తల్లిపేరున పెట్టాడని, రిటైర్ అవగా వచ్చిన డబ్బులో కొంత చెల్లెలి పెళ్లికి వేసి మిగిలింది తన కర్మకాండల నిమిత్తం

[illegible].

తండ్రి పోయినంతరం ఆ ఆస్తి తన పేర్న వస్తుందో లేదో తెలియదు. బాధ్యతలు లేని కొడుక్కి హక్కులు వుండకూడదు అన్నట్లుగా తండ్రి చేసిన పనికి ఒళ్ళుమండుకొచ్చింది సుదర్శనానికి. తండ్రి తర్వాత వచ్చే డబ్బు మీద అతడు ఎన్నో ఆశలు పెంచుకున్నాడు.

కానీ వచ్చి రాగానే అశనిపాతంలాంటి వార్త ఎదురైంది.

ఏదైనా చేజిక్కించుకోవాలంటే ఇంతకు మించిన తరుణం లేదు. అందుకే తన మనసులోని మాటను బయటపెట్టాడు.

తల్లిపేరున ఉన్న ఎకరం పొలం తన పేరున పెడితేనే తప్ప తండ్రిని దహనం చేసేది లేదని ఖచ్చితంగా చెప్పేశాడు.

తండ్రికి పెద్ద కొడుకే తల కొరివి పెట్టాలి అన్నమాట అతని పాలిట వజ్రాయుధంలా తోచింది.

ఆ ఆయుధాన్నే ప్రయోగించాడు ఇప్పుడు. వచ్చిన చుట్టపక్కాలు అందరూ అనేకవిధాల అతనికి నచ్చచెప్పడానికి ప్రయత్నించారు.

"ఊహూ" అతడు ఎవరి మాటల్ని లక్ష్యపెట్టదల్చుకోలేదు. ఆఖరుకు చుట్టుప్రక్కల వాళ్ళ వచ్చి...

"తెల్లవారుజామున పోయిన మనిషిని ఇంతవరకూ తీసుకువెళ్లే ఏర్పాట్లు చేయలేక పోతే ఎలాగండీ. వీధిలో శవాన్నుంచుకుని ముద్ద మింగలేంకదా? మీ ఇంటి తగవులు తర్వాత తేల్చుకుందురుగాని ముందు కాని ముందు ఈ విషయం చూడండి" అన్నారు.

"ఈ విషయం అటో ఇటో తేలితే తప్ప శవాన్ని కదిలించేది లేదు" మొండిగా అన్నాడు.

ఆ తర్క వితర్కాల మధ్య సూర్యుడు అస్తమించడం, చంద్రుడు ఉదయించడం జరిగిపోయింది.

అందరూ తలోరకంగా విమర్శిస్తున్నారు. తాను పట్టిన కుందేటికి మూడేకాళ్ళు అనే పట్టుదలమీద వున్నాడు సుదర్శనం.

ఎవరేం అనుకున్నా హాల్లో మధ్యగా పడుకున్న నారాయణ శవం మాత్రం తనకేం పట్టనట్లుగా నిశ్చలంగా వుంది.

○ ● ○

తనలో తను కుమిలిపోతున్న అన్నపూర్ణమ్మకు భర్త పోయిన బాధకన్నా కొడుకు జరిపిస్తున్న పంచాయతీలకే దుఃఖం మరింతగా ముంచుకువస్తోంది.

తల్లి పక్కనే కూర్చున్న మూడోపిల్ల వినూత్న జరుగుతున్న వింత చూస్తోంది.

"అమ్మా! ఉదయంనుంచి పచ్చి మంచి నీళ్లయినా తాగలేదు. కనీసం ఈ మజ్జిగరసం అయినా తాగు, ఏద్చేందుకైనా ఓపిక వుండాలికదా" అని బలవంతంగా పై ఇద్దరు ఆడపిల్లలూ తల్లికి పట్టించారు.

కృతజ్ఞతగా చూసింది వినూత్న అక్కల వైపు.

తండ్రి జ్ఞాపకాలగురించి తల్చుకుని కన్నీరు కారుస్తున్న ఆడపిల్లలిద్దరూ తమ మనసులోని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

"చూశావా అమ్మా! అన్నయ్య వచ్చిన దగ్గర్నుంచి పొలాన్నిగురించి తప్ప మరో మాటే మాట్లాడడంలేదు. వాడికి కావాల్సింది డబ్బు తప్ప, నాన్నంటే ఏమాత్రం ప్రేమలేదు. వాడి తిక్క కుదరాలంటే మ

వ్యాక పని చెయ్యి. మా భర్తలంటే నాన్నగార్కి పంచప్రాణాలు. అందుకే ఆ పొలాన్ని మా మొగుళ్ల పేరున పెట్టు. దహనంతోపాటు మిగిలిన విషయాలన్నీ వాళ్లే చూస్తారు. విమాత్న పెళ్లి సంగతికూడా మాకు వదిలెయ్యి'' అన్నారు కోరస్‌గా.

తల్లి కన్నీరు మినహా వేరే సమాధానమే దొరకలేదు వాళ్లకి.

అక్కల మనసేమిటో పూర్తిగా బోధపడింది విమాత్నకు. ఒక్క మనిషి మరణంతో అందరి మనసులోని ఆలోచనలు ఎంత త్వరగా బైటపడ్డాయి. అక్కలు — బావలు ఒక గదిలో, అన్నా వదినా మరో గదిలో చర్చలు సాగిస్తున్నారు.


ఉదయంనుంచి ఏడ్చి ఏడ్చి అలసిపోయిన అన్నపూర్ణమ్మ ఇంక శక్తిలేనట్లు గోడవారన వాలిపోయింది.

సమయం కాదు అని ఊరుకుందికానీ, చెప్పుతీసుకుని కొడుకు చెంపలు ఎడాపెడా వాయించాలి అన్నంత కోపం, ఆవేశం, దుఃఖం మిళితమయ్యాయి ఆమె మనసులో . మనసు మమత లేని కర్కోటకపు కొడుకును కన్నందుకు తనను తానే దుయ్యబట్టుకుందామె.

మీ నాన్నగారికి ఒంట్లో బాగుండడంలేదు. నిన్ను చూడాలని కలవరిస్తున్నారు. ఒక్కసారి రమ్మని ఎన్ని జాబులు రాసింది తను. ఉహూ! వస్తేనా? వాడికి ఎంతసేపూ డబ్బుమీద ధ్యాసతప్ప అమ్మ నాన్నలమీద మమకారం వుంటేగా?

అందుకే ఆయన కడసారి తనతో... ''పూర్ణా! ఎట్టి పరిస్థితుల్లోనూ పొలాన్ని చెయ్యిజార్చుకోకు. నీకు ఇది ఒక్కటే ఆధారం. కన్న మమకారంతో ప్రవర్తించావా వాళ్లు ఇళ్లలో చెయ్యి చాచవలసిందేతప్ప నిన్ను చూసేవాళ్లు లేరు. పరాయింటి ఆడపిల్ల సొమ్ము ఆశించకు. విమాత్నవి ఓ ఇంటిదాన్ని చెయ్యి'' అన్నారు.

దిక్కులేని మనిషిలా పడున్న భర్తను చూస్తుంటే దుఃఖం కట్టలు తెంచుకువచ్చిం



ది ఆమెకు. బ్రతికి వున్నంతకాలం మనస్తాపాన్ని కలిగించినవాడు తండ్రిపోయాక కూడా నరకాన్ని చూపిస్తున్నాడు. కష్టంలో వున్న తల్లిని ఆప్యాయంగా పలకరించనివాడు కొడుకా? కాదు, ఏవాడో తనకి ఆగర్భశత్రువు. అలాంటి వాడిచేతి అగ్నిసంస్కారం ఆయన మనసుకి అశాంతినేతప్ప ప్రశాంతిని ఇవ్వదు.

కొడుకుగా వాడు తప్పుచేశాడని, తల్లిగా తనూ అదే తప్పు చెయ్యలేదుగా. పరువుపోయాక డబ్బున్నా పోయినా ఒక్కటే. అందుకో పోబోతున్న పరువును నిలబెట్టుకోవాలని నిశ్చయించుకున్నదామె.

తడబడుతున్న అడుగులతో లేచి బీరువాలో కాగితాలు తీస్తున్న తల్లిని వారించింది వినూత్న.

తల్లి నిర్ణయానికి పర్యవసానం తనకి బాగా తెల్సు. తర్వాత ఆవిడ స్థితి ఏమిటో ఊహించిన వినూత్న కంపించిపోయింది. తల్లిని హత్తుకుని బావురుమంది.

ఆ రాత్రంతా వినూత్న మనసు రాయి తగిలిన తేనెతుట్టెలా అలజడిగా వుంది. తెల్లవారుతూనే ఆమె ఆలోచనలు ఒక స్థిరరూపం దాల్చాయి.

○ ● ○

తెల్లగా తెల్లవారిపోయింది.

సూర్యుడు ఉదయించాడు.

''మాస్టారూ! నాన్నగారిని తీసుకువెళ్లేందుకు కావాల్సిన ఏర్పాట్లు చూడండి'' అంది వినూత్న ఆయన చేతికి డబ్బులు ఇస్తూ.

''నాకు తెల్సునమ్మా సుదర్శనం మనసు'' అన్నారు ఆయన కళ్ళు ఒత్తుకుంటూ.

''అన్నయ్య మనసుని చాలా తప్పుగా అర్థంచేసుకున్నారు మీరు. నాన్నగారిని దహనం చేసేది అన్నయ్యకాదు. నేను'' నిశ్చయంగా చెప్పిందామె.

ఒక్కసారిగా ఉల్లిక్కిపడ్డారాయన.

''ఏమిటమ్మా నువ్వు చెప్పేది. నువ్వు... నువ్వు సంస్కారం చేస్తావా?'' విస్మయంగా చూశారాయన.

''ఏం మాస్టారూ! నేను తలకొరివి పెడితే నాన్నగారు దహనంకారా?'' సూటిగా ప్రశ్నించిందామె.

దీనికి పిచ్చిపట్టింది అనుకున్నారు అక్కలిద్దరూ.

''కొడుకుని నేనుండగా నువ్వెలా చేస్తావ్ పని?'' కరుగ్గా అన్నాడు సుదర్శనం.

కథ మరో మలుపు తిరిగిందని వింతగా చూస్తున్నారు మిగిలినవాళ్లు అందరూ.

''కొడుకువి! నువ్వు కన్నకొడుకువి కదూ'' పిచ్చిగా నవ్వింది వినూత్న.

''అవును. నువ్వు కొడుకువి. మగాడివి. దహనం అనే అధికారాన్ని కొడుకులకేగా అప్పజెప్పారు. అందుకే ఆ అవకాశాన్ని నువ్వు కేష్ చేసుకోవాలని వచ్చిన దగ్గరనుంచీ నాన్నని దహనం చేసేందుకు అమ్మనుంచి లంచాన్ని ఆశిస్తున్నావు. నాన్నంటే ప్రేమ, అభిమానం వున్నవాడివైతే, ఇంటి పరువు ప్రతిష్ఠలనుగురించి ఆలోచించినవాడివైతే నువ్వా మాట అనేవాడివా? పుత్రుడు పుడితే పున్నామ నరకంనుంచి తప్పిస్తాడనే పిచ్చి నమ్మకం కల తల్లిదండ్రులకి నువ్వో చక్కని గుణపాఠం. బ్రతికుండగా నరకాన్ని చవిచూపిన నువ్వు పుత్రుడిగా తగవు. అందుకే ఆయన్ని దహనంచేసేఅధికారం నీకులేదు''

''మరొక్కసారి ఆలోచించమ్మా'' అ

న్నాడు మాస్టారు.

"లేదండీ. అన్నయ్య ఆ అర్హతని కోల్పోయాడు. అనాధ ప్రేత సంస్కారం కోటి యజ్ఞాల ఫలం అంటారు. ఎందరో ముందుకు వస్తారు. కన్నతండ్రి అగ్నిసంస్కారానికి కాసులాసించేవాడికి ఆ అర్హతే లేదు"

"చూడమ్మా! నాన్నగారి ఆత్మకి శాంతి కలగాలంటే అన్నయ్యే ఈ పని చేయాలమ్మా. అతడికే ఈ అర్హత వుంది. ఆడపిల్లకా అధికారం లేదు. అయినా శాస్త్రం ఒప్పదు"


"హూ... శాస్త్రం. ఎక్కడుంది మాస్టారూ ఈ శాస్త్రం. ఈ శాస్త్రాలూ సాంప్రదాయాలూ మనం ఏర్పరచుకున్నవేగా. నిజానికి దానికే కళ్లుంటే, చెవులుంటే, నోరుంటే విన్నటినుంచీ అన్నయ్య చేస్తున్న హటాన్ని హర్షించి ఊరుకునేవారా? తండ్రికి కొడుకుగా నీ విధిని ఎందుకు నిర్వర్తించవు అని మందలించడానికి రాని ఈ సాంప్రదాయాలు ఆడపిల్లగా నీకు ఈ సాహసం కూడదని మందలించడానికి మాత్రమే ఎందుకు ముందుకు వస్తాయి చెప్పండి?

నిజంగా న్యాయం, ధర్మం, శాస్త్రం అనేవి ఈనాటికి మిగిలి వుంటే, అవే నిజమైన కొడుకులు పెట్టిన కొరువులు మాత్రమే మండి కూతుళ్లు పెట్టిన కొరువులు చప్పున చల్లారిపోతాయా చెప్పండి. కొడుకుగా అన్ని అధికారాలు కాదనుకున్నా ఈ అధికారం నాది అన్న అహంకారంతోనే గా అన్నయ్య అలా ప్రవర్తిస్తున్నాడు. పొలం రాస్తేనే దహనం చేస్తాను. స్థలం రాస్తేనే కర్మ చేస్తాను అని మానవత్వాన్ని చంపుకుని ప్రవర్తించే ఈ కొడుకుల కొరువులకన్నా ప్రేమ, అభిమానంతో కూతుళ్లు పెట్టే కొరువులే పైలోకాల్లో వాళ్లకి మనశ్శాంతిని కలిగిస్తాయి. ముందు మీరా ఏర్పాట్లు చూడండి" అంది వినూత్న.

"నన్ను క్షమించమ్మా! అన్నయ్య కోరినట్లుగా చేస్తే ఆ తర్వాత నిన్ను దిక్కులేనిదానిలా చూడలేకనే నేను ఈ నిర్ణయానికి

## పెసరట్టు

హోటల్‌లో ఓ వ్యక్తిని అడిగాడురవి.
"సార్ మిమ్మల్నెక్కడో చూసినట్లుందే"—
"ఎక్కడోకాదు. ఇక్కడే చూశారు. ఉదయం మీరు కాఫీ తాగి వెళ్లే ముందు పెసరట్టు ఆర్డరిచ్చాను. ఇంకా తీసుకురాలేదు సర్వర్"
— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



వచ్చావమ్మా!'' అంది కన్నీటితో తల్లి పాదాలమీద వాలిన వినూత్న.

తనని లేవదీస్తున్న తల్లి చేతుల స్పర్శ నువ్వు చేస్తున్న పని ఏమాత్రం తప్పుకాదు అన్నట్లుగా ధైర్యాన్ని ఇస్తున్నట్లు అన్పించాయి ఆమెకు.

జరుగుతున్నదాన్ని నోరుతెరుచుకుని చూస్తుండిపోయాడు సుదర్శనం.

తండ్రికి స్నానం చేయించి, నుదుట విభూతి దిద్ది, నూతన వస్త్రాలతో పాడినెక్కించి అగ్నిహోత్రపు కుండను చేతధరించి ఆదిశక్తిలా ముందుకు కదిలింది వినూత్న. నూతన శకానికి నాంది పలుకుతున్నట్లు ఆమె పెట్టిన కొరివి తాలూకు మంటలు మిన్నెత్తున ఎగిసిపడుతున్నాయి. ఆ అగ్నిశిఖల మధ్యనుంచి చిరునవ్వుతో తనవైపు చూస్తూ ...

''శభాష్ వినూత్నా! నా ఆదర్శాలకు అనుగుణంగా నేను కోరి నీకు పెట్టుకున్న పేరును సార్థకం చేశావు తల్లీ. ఆత్మస్థైర్యంతో నువ్వు ఈనాడు చేసిన పనికి నేను ఆనందంగా ఊర్ధ్వలోకాలకు తరలిపోతున్నానమ్మా'' అంటున్నట్లు అన్పించిన తండ్రి మాటలకు దుఃఖం పొంగుకువచ్చింది వినూత్నకు.

★

